సాక్షి ఒడిశా

బుధవారం । 11 । డిసెంబర్ । 2024



చేతబడి నెపంతో వ్యక్తి హత్య

చేతబడి నెపంతో ఓ వ్యక్తిని హత్య చేశారు. కొరాపుట్ జిల్లాలో ఘటన జరిగింది.

- 10లో



ఉల్లాసంగా.. ఉత్సాహంగా

రాయగడలో చైతీ మహోత్సవాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. క్రీడా పోటీలు నిర్వహించారు.

- 10లో



మినీ మారథాన్

మాల్యవంత్ ఉత్సవాల్లో మినీ మారథాన్ నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

- 10లో

న్యూస్‌రీల్

ఉత్సాహంగా వాలీబాల్ టోర్నమెంట్



పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధాన్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా స్థాయి మాల్యవంత్ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక స్టేడియంలో వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లా అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధన్ పోటీలను ప్రారంభించారు. కలిమెల, పోడియా, మత్తిలి, ఖోయిర్‌పుట్, చిత్రకొండ, కోరుకొండ, మల్కన్‌గిరి సమితులకు వాలీబాల్ జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. కలిమెల-ఖోయిర్‌పుట్ జట్ల మధ్య ఫైనల్ పోరు జరిగింది. కలిమెల జట్టు విజయం సాధించగా.. ఖోయిర్‌పుట్ జట్టు రన్నర్‌గా నిలిచారు. విజేతలకు ఈ నెల 13వ తేదీ నుంచి జరగనున్న మల్యవాంత్ ఉత్సవాల్లో బహుమతులు అందజేస్తారని అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధన్ తెలిపారు.

త్వరలో డబుల్ డెక్కర్ సిటీ బస్సులు



డబుల్ డెక్కర్ బస్సు నమూనా

భువనేశ్వర్: రాష్ట్రంలో త్వరలో డబల్ డెక్కర్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. క్యాపిటల్ రీజియన్ అర్బన్ ట్రాన్స్‌పోర్టు క్రట్ ఈ సదుపాయాన్ని ప్రవేశ పెట్టేందుకు సన్నాహాలు ప్రారంభించింది. తొలి విడతలో ఐదు విద్యుత్ డబల్ డెక్కర్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. ఈ బస్సులు భువనేశ్వర్ కేంద్రంగా కటక్, ఖుర్దా, పూరీ ప్రాంతాల్లో తిరగనున్నాయి.

మానవహక్కులపై అవగాహన



వేదికపై మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ వేద్‌బర్ ప్రధాన్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా జైలులో మంగళవారం జైలు వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. జైలు సూపరింటెండెంట్ దిలీప్ కుమార్ జేన్నా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా అదనపు కలెక్టర్ వేద్‌బర్ ప్రధాన్, జిల్లా అదనపు ఎస్పీ తాపాస్ నారాయణ్ రోతోలు హాజరయ్యారు. ఖైదీలకు ఎలాంటి సదుపాయాలు అందుతున్నాయో వివరించారు. మానవ హక్కుల గురించి అవగాహన కల్పించారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. చివరిగా ఖైదీలు నృత్య ప్రదర్శన నిర్వహించారు.

175 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మహేష్

రాయగడ: స్థానిక బ్యాంక్ కాలనీ రెండో లైన్‌లోని కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. విజయనగరం వెంకటరమణ ఆస్పత్రికి చెందిన డాక్టర్ చిట్టి రమణారావు, డాక్టర్ మహేష్‌లు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. విద్యార్థులు, పరిసర ప్రాంతాలకు చెందిన 175 మందిని పరీక్షించిన వైద్యులు అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.ఎస్.ఆచారి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమ సంస్థ గత ఏడాది కూడా ఇటువంటి తరహా ఉచిత వైద్య శిబిరం నిర్వహించటంతో ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. అందుకే ఈ ఏడాది కూడా శిబిరాన్ని నిర్వహించామని చెప్పారు. ఇకపై మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు సన్నహాలు చేస్తున్నామని అన్నారు. అసోసియేషన్ కార్యదర్శి పి.గౌరిశంకరరావు, సీహెచ్ సాంబాబు సహకరించారు.

రాష్ట్రంలో కొత్త విమానాశ్రయం

- చరబటియా కేంద్రంగా కొత్త విమానాశ్రయం ఏర్పాటుకు సన్నాహాలు
- కేంద్ర మంత్రితో కటక్ ఎంపీ సంప్రదింపులు



పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడుతో కటక్ లోక్ సభ సభ్యుడు భర్తృహరి మెహతాబ్ మంతనాలు



చరబటియా కేంద్రంగా ప్రముఖ ప్రాంతాలకు అనుసంధాన సౌకర్యం

భువనేశ్వర్: రాష్ట్రంలో కొత్తగా మరో విమానాశ్రయం ఏర్పాటుకు బీజం పడింది. కొత్త ఎయిర్‌పోర్టు ఏర్పాటైతే రాష్ట్రంలో పర్యాటక, పారిశ్రామిక, వర్తక, వ్యాపార, ఆర్థిక రంగాల పురోగతికి దోహదపడుతుంది. కటక్ లోక్ సభ నియోజక వర్గం సభ్యుడు భర్తృహరి మెహతాబ్ ఈ మేరకు పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో ప్రత్యక్షంగా సంప్రదింపులు ప్రారంభించారు. చరబటియా కేంద్రంగా మరో విమానాశ్రయం కోసం కేంద్ర మంత్రికి ప్రతిపాదించారు. ఈ చొరవ ఒడిశా పురోగతికి దోహదపడుతుందని సర్వత్రా ప్రసంశలు అందుకుంటోంది. ఏటా విమాన రవాణా పెరుగుతోంది. కొత్త విమానాశ్రయం ఏర్పాటైతే ప్రస్తుత భువనేశ్వర్ బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం, కొత్తగా నిర్మితం కానున్న పూరీ విమానాశ్రయంపై రవాణా ఒత్తిడి తగ్గిస్తుంది. ఎంపీ భర్తృ హరి మెహతాబ్ యోచన వాస్తవంగా కార్యరూపం దాల్చితే రాష్ట్రంలో 3 ప్రధాన విమానాశ్రయాలు అందుబాటులోకి వస్తాయి. రాష్ట్రంలో విమానాశ్రయాల విస్తరణకు రహదారి అనుసంధానం కీలకం. విమానాశ్రయాలకు సునాయాస రాకపోకల కోసం త్వరలో ప్రారంభం కానున్న మెట్రో రైలు, ఎక్స్‌ప్రెస్‌వేల విస్తరణ ప్రాధాన్యత సంతరించుకుంటాయి. కటక్, భువనేశ్వర్ జంట నగరాల అనుసంధానంతో మెట్రో రైలు నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. తదుపరి దశలో ఈ ప్రాజెక్టుని ఖుర్దా, పూరీ ప్రాంతాలకు అనుసంధానపరిచే ఆలోచన పరిశీలనలో ఉంది. ఇదే క్రమంలో ఎక్స్‌ప్రెస్ రహదారుల నిర్మాణం కూడా దీనికి తోడుగా ఉంటుంది. జనసందోహిత పట్టణ, నగర ప్రాంతాల నుంచి భువనేశ్వర్, చరబటియా, పూరీ విమానాశ్రయాల మధ్య చక్కటి అనుసంధానం విమానయాన పర్యాటకులకు చక్కటి వరంగా నిలుస్తుంది.

అనతి దూరంలోనే..

చరబటియాలో కొత్త విమానాశ్రయం ఏర్పాటులో సమీప దూరంలో 3 విమానాశ్రయాలు అందుబాటులోకి వస్తాయి. భువనేశ్వర్, కటక్ జంట నగరాల మధ్య దూరం కేవలం 23 కిలోమీటర్లు కాగా భువనేశ్వర్, పూరీ మధ్య దూరం 56 కిలోమీటర్లు మాత్రమే. సుమారు 80 కిలోమీటర్ల పరిధిలో 3 విమానాశ్రయాల ఏర్పాటు చక్కటి ప్రగతికి సందేశిమిస్తుంది.

సమతుల్య యోచన మేలు

రాష్ట్రం నలు వైపుల విమానాశ్రయాలు, రవాణా సౌకర్యాల విస్తరణ సమతుల్యంగా కొనసాగించడం బహుళార్థ ప్రయోజనాలకు దోహదపడుతుంది. ప్రస్తుత యోచన గ్రేటర్ క్యాపిటల్ రీజియన్ పురోగతికి పరిమితం అవుతుంది. దీంతో ఉత్తర ఒడిశా కొంత మేరకు లబ్ధి పొందుతుంది. పశ్చిమ, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు విమాన రవాణా నామమాత్రంగానే ఉంది.

చరబటియా అంతర్జాతీయ ఏవియేషన్ హబ్

తూర్పు భారత దేశం పురోగతికి ప్రధాన మంత్రి అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ఈ తరుణంలో చరబటియాలో విమానాశ్రయం యోచన అతి పెద్ద అంతర్జాతీయ విమానయాన కేంద్రంగా వెలుగొందే అవకాశం కలిసి వస్తుంది. భారత దేశం నుంచి దక్షిణ ఆసియాతో మరిన్ని ఖండాంతర ప్రాంతాలకు విమాన రాకపోకలకు హబ్‌గా చరబటియా విమానాశ్రయం నిలుస్తుంది. చరబటియా కేంద్రంగా విమాన కార్గో (సరుకు రవాణా) పారిశ్రామిక, వర్తక, వ్యాపార లావాదేవీలకు కేంద్రంగా ఉండబోతోంది. స్వదేశీ, విదేశీ, ఖండాంతర విమానయానంతో సరుకు రవాణా రాష్ట్ర ఆర్థిక పురోగతికి బలమైన వారధిగా దోహదపడతుంది.

బైక్‌ని ఢీకొన్న ట్రక్కు

- ముగ్గురు దుర్మరణం



దుర్ఘటన దృశ్యం

భువనేశ్వర్: బైక్‌ని ట్రక్కు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. నువాపడా జిల్లా దొలొదొలి గ్రామంలో చోటు చేసుకుంది. మృతుల్లో హేతు రామ సబర్, శ్యామ సబర్ అన్నదమ్ములు కాగా కొకాగుడు థొరువా వీరి మిత్రుడిగా గుర్తించారు. వీరు ముగ్గురు నువాపడా జిల్లా కొర్లాపొడా గ్రామస్తులు. నువాపడా నుంచి వీరి స్వగ్రామానికి వెళ్తుండగా 353వ నంబరు జాతీయ రహదారిపై దొలొదొలి గ్రామం సమీపంలో ట్రక్కు ఢీకొంది. స్థానికులు చొరవ కల్పించుకుని క్షతగాత్రులని హుటాహుటిన చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు వీరంతా మృతి చెందినట్లు ధ్రువీకరించారు. లఖనా థాణా పోలీసులు ఘటనా స్థలం సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

రెండు ట్రక్కులు ఢీ.. డ్రైవర్ మృతి



ముఖాముఖి ఢీకొన్న ట్రక్కులు

భువనేశ్వర్: జాజ్‌పూర్ జిల్లాలో మంగళవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రెండు ట్రక్కులు ముఖాముఖి ఢీకొన్నాయి. ఘటనా స్థలంలో డ్రైవరు మృతి చెందాడు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితునికి చికిత్స కోసం జాజ్‌పూర్ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చేర్చారు. జాజ్‌పూర్ జిల్లా సాహాపూర్ వంతెనపై ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. కటక్ నుంచి భద్రక్ వైపు వెళ్తున్న ట్రక్కుని బాలేశ్వర్ నుంచి భువనేశ్వర్‌కు మార్బుల్ రవాణా చేస్తున్న ట్రక్కు ఎదురుగా వచ్చి ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ సంఘటనతో సాహాపూర్ వంతెనపై వాహనాల రాకపోకలకు స్వల్ప అంతరాయం ఏర్పడింది. పాణికొయిలి థాణా పోలీసులు ఘటనా స్థలం చేరి దర్యాప్తు చేపట్టారు.

ముఖ్యమంత్రిని కలిసిన సింగపూర్ హై కమిషనర్



ముఖ్యమంత్రితో చర్చిస్తున్న సింగపూర్ హైకమిషనర్

భువనేశ్వర్: ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝిను సింగపూర్ హై కమిషనర్ సైమన్ వాంగ్ మంగళవారం కలిశారు. లోక్ సేవా భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సింగపూర్ అధ్యక్షుడు ధర్మన్ షణ్ముగరత్నం వచ్చే ఏడాది జనవరిలో భారత పర్యటనకు విచ్చేస్తున్నారు. ఈ సందర్భంగా ఒడిశాలో పర్యటించనున్నారని హై కమిషనర్ ముఖ్యమంత్రికి తెలిపారు. రాష్ట్రంలో పెట్రో రసాయనాలు, గ్రీన్ ఎనర్జీ, నైపుణ్యత రంగాల్లో సింగపూర్ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి ప్రదర్శించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఉత్కర్ష్ ఒడిశా, మేక్ ఇన్ ఒడిశాలో సింగపూర్ భాగస్వామిగా నిలువనుందని హై కమిషనర్ ప్రకటించడం పట్ల ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. గత నెలలో ముఖ్యమంత్రి సింగపూర్‌లో పర్యటించారు.

కొనసాగుతున్న ఆందోళన

- ప్రభుత్వంపై విరుచుకు పడిన బీజేడీ



పర్లాకిమిడి: భువనేశ్వర్‌లో పీఎంజీ చౌక్‌వద్ద మిషన్ శక్తి జి.పి.ఎల్.ఎఫ్.కార్యకర్తలు, ఎమ్మెల్యేరూపేష్ పాణిగ్రాహి



భువనేశ్వర్: దిగువ పీఎంజీ ప్రధాన మార్గంలో మిషన్ శక్తి కార్యకర్తల ఆందోళన



పర్లాకిమిడి: పీఎంజీ చౌక్‌వద్ద మిషన్ శక్తి జీపీఎల్‌ఎఫ్ కార్యకర్తలు

భువనేశ్వర్: బకాయి జీతభత్యాల విడుదల కోసం రాత్రింబవళ్లు ఆందోళన నిర్వహిస్తున్న మిషన్ శక్తి కార్యకర్తల ఆందోళనకు ప్రతిపక్షం బిజూ జనతా దళ్ అండగా నిలిచింది. ఉద్దేశపూర్వకంగా మహిళా కార్యకర్తల జీతాల్ని బీజేపీ ప్రభుత్వం నిలిపివేసి వేధిస్తోందని బిజూ జనతా దళ్ అధినేత, విపక్ష నేత నవీన్ పట్నాయక్ మంగళవారం బాహాటంగా ఆరోపించారు. మరో వైపు కాంగ్రెసు వీరి ఆందోళనకు మద్దతు ప్రకటించింది. నడి రోడ్డు మీద మహిళలు రాత్రింబవళ్లు ఆందోళన చేస్తుండగా సభలో వీరి విషయం పట్ల ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఎంత మాత్రం తగదని బీజేడీ చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్ అన్నారు. విపక్ష బీజేడీ వైఖరిపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల సంక్షేమానికి తమ ప్రభుత్వం అన్ని విధాలా సహకరించి సానుకూలంగా స్పందిస్తుందని ఆమె అభయం ఇచ్చారు. మిషన్ శక్తి కార్యకర్తల ఆందోళనపై సభలో సోమవారం వివరంగా సభలో చర్చించడం జరిగిందని మంత్రి ప్రభాతి పరిడా తెలిపారు. బూటకపు మాటలతో తప్పు దారి తొక్కకుండా మహిళలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆమె అభ్యర్థించారు. మహిళలకు న్యాయం చేసేందుకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. మిషన్ శక్తి కార్యక్రమం కింద ఎంబీకే, బ్యాంకు మిత్ర, కృషి మిత్ర, ప్రాణి మిత్ర వంటి వర్గాలుగా సేవలు అందిస్తున్న మహిళలు ఏప్రిల్ నెల నుంచి తమ జీతభత్యాలు పొందక ఆందోళన చేపడుతున్న విషయం విదితమే.

మిషన్ శక్తి వర్కర్ల ధర్నా

పర్లాకిమిడి: అఖిల భారత జీపీఎల్‌ఎఫ్ మిషన్ శక్తి కార్యకర్తల సంఘం, కమ్యూనిటీ సపోర్టు సిబ్బంది భువనేశ్వర్‌లో పీఎంజీ చౌక్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా జరిపారు. ఈ ధర్నాకు గజపతి జిల్లా ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి మద్దతు తెలిపారు.

పంట విక్రయించేందుకు పాట్లు



గుసాని సమితి జాజిపురం గ్రామంలో ఆరుబయట ధాన్యం ఎండబెడుతున్న రైతులు



జాజిపురం రైతు జయసేన్ బిశ్వాళ్



జాజిపురం రోడ్డు పక్కన ధాన్యం ఆరబెడుతున్న రైతులు

పర్లాకిమిడి: ధాన్యం విక్రయించేందుకు రైతులు పాట్లు పడుతున్నారు. జిల్లాలోని గుసాని సమితి కోర్సండ, సర్దాపురం, జాజిపురం, కత్తల కవిటి, రాసూరు, ఆర్.సీతాపురం గ్రామాల్లో రైతులు పండించిన ధాన్యాన్ని రోడ్డు పక్కనే ఆరబెడుతున్నారు. డిసెంబరు 30 నుంచి సొసైటీల వద్ద విక్రయ కేంద్రాలు తెరుస్తున్నారు. ఖరీఫ్‌లో రైతులకు ధాన్యం మద్దతు ధర క్వింటాకు రూ.3100 ఇన్‌పుట్ సబ్సిడీతో కలిపి ఇస్తున్నారు. అందువల్ల దళారుల ప్రలోభాలకు లొంగవద్దని కలెక్టర్ బిజయకుమార్ దాస్ అన్నారు. జిల్లాలో 45 మండీల్లో 15,580 మంది రైతులు ధాన్యం అమ్మకానికి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వారికిచ్చిన టోకెన్ల గడువు ముగిసిపోతే కలెక్టరేట్‌లో తిరిగి టోకెన్ల గడువు పెంపునకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. రైతులు ధాన్యంను బాగా ఎండబెట్టి, ఎగురపోతవేసి మండీలకు ధాన్యం పంపించాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రఫుల్ల కుమార్ బెహరా అన్నారు. ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్‌కు ధాన్యం తరలిపోకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని సీఎస్ఓ అన్నారు.

రాజ్యసభకు ఒకే అభ్యర్థి పోటీ

భువనేశ్వర్: రాష్ట్రం నుంచి ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి ఒకే నామినేషన్ దాఖలైంది. ఈ మేరకు రాష్ట్ర శాసన సభ సచివాలయం మంగళవారం స్పష్టం చేసింది. భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా సుజిత్ కుమార్ ఒక్కరు మాత్రమే నామినేషను దస్తావేజులు దాఖలు చేశారు. మంగళవారంతో రాజ్యసభ ఉప ఎన్నిక పోటీకి నామినేషను దాఖలు గడువు ముగిసింది. గడువు ముగిసే సరికి సుజిత్ కుమార్ ఒకే అభ్యర్థి పోటీకి నామినేషను దాఖలు చేసినట్లు శాసన సభ అధికార వర్గాలు తెలిపాయి.

ఏఓబీలోనే పెద్దపులి



విద్దడ గ్రామంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెబుతున్న అటవీ అధికారులు



ఏఓబీలో సంచరిస్తున్న పెద్దపులి



విద్దడ గ్రామంలో అటవీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: పెద్దపులి ఏఓబీలోనే సంచరిస్తోందని గారబంద, గండాహతి అటవీ అధికారులకు సమాచారం అందింది. జిల్లాలో గుసాని సమితి శోబర పంచాయతీ అంధరా జుల్లాలో నాలుగు రోజుల కిందట ఒక ఆవును తిన్న తర్వాత పక్కనే ఉన్న ఆంధ్రాలోని శ్రీకాకుళం జిల్లా మందస మండలం బాణాపురంలో తిరుగుతోందని డీఎఫ్ఓ ఎస్.ఆనంద్ సమాచారం ఇచ్చారు. తాజాగా పులి రాయగడ బ్లాక్ గండాహతి ప్రాంతంలో సంచరిస్తున్నట్లు మంగళవారం ఉదయం అటవీ అధికారులకు తెలియడంతో వారు ఆ ప్రాంతానికి చేరుకుని గ్రామస్తుల వద్ద నుండి సమాచారం సేకరించారు. అయితే పెద్దపులి మందస మండలంలో చీపి, భిన్నల, డబారుసింగి అటవీ ప్రాంతంలో తిరుగుతున్నట్టు సమాచారం. దీనిపై సరిహద్దు గ్రామం మట్టపైలంలో ఫారెస్టు రేంజ్ అధికారి యం.కామేశ్వరరావు, గండాహాతి వనసంరక్షక సేవకుడు కాశీప్రసాద్ తో ప్రజలకు పెద్దపులిపై అవగాహన కల్పిస్తున్నారు.

చంద్రపూర్‌లో గంజాయి సాగుపై దాడులు



రాయగడ: దాడుల్లో పాల్గొన్న అబ్కారీ, పోలీస్ సిబ్బంది



రాయగడ: గంజాయి మొక్కలను తగులబెడుతున్న సిబ్బంది



మల్కన్‌గిరి: స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తా, నిందితుడితో పోలీసులు

రాయగడ: జిల్లాలోని మారుమూల ప్రాంతమైన చంద్రపూర్ సమితిలో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి సాగుపై పోలీసులు, అబ్కారీ శాఖ సిబ్బంది సోమవారం విస్తృతంగా దాడులను నిర్వహించారు. సనపంకాల్, బడపంకాల్ ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో 14 ఎకరాల విస్తీర్ణంలో సాగవుతున్న గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. సుమారు 14 వేల గంజాయి మొక్కలను తగులబెట్టినట్లు జిల్లా పోలీస్ కార్యాలయం మంగళవారం నాడు విడుదల చేసిన పత్రిక ప్రకటనలో పేర్కొంది.

15 కిలోల గంజాయితో ఒకరి అరెస్టు

మల్కన్‌గిరి: 15 కిలోల గంజాయితో ఒకరిని ముదిలిపోడ పోలీసులు అరెస్టు చేశారు. మల్కన్‌గిరి జిల్లా కోయిర్‌పుట్ సమితి ముదిలిపోడ పోలీసుస్టేషన్ పరిధిలోని లమగూడ గ్రామం వద్ద సోమవారం రాత్రి ఎస్ఐ అర్జున్ తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో ఓ వ్యక్తి బైక్‌పై వస్తుండగా అతని పోలీసులు తనిఖీ చేయగా ఓ బస్తాలో 15 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో అతన్ని అరెస్టు చేశారు. ఇతని పేరు టాంకధర్ పంగిగా గుర్తించారు. పట్టుబడిన గంజాయి విలువ లక్ష రూపాయలు ఉంటుందని ఎస్ఐ అర్జున్ తెలిపారు. నిందితుడిని మంగళవారం కోర్టులో హాజరు పరిచారు.

క్లుప్తంగా

వివాహిత అనుమానాస్పద మృతి


స్వాతి (ఫైల్)

నరసన్నపేట: స్థానిక శ్రీదేవినగర్‌లో నివాసముంటున్న అంధవరపు స్వాతి (40) అనుమానాస్పదంగా మృతి చెందింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో స్వాతి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని భర్త మధుసూదనరావు చెబుతుండగా..తమ కుమార్తెను అల్లుడే హతమార్చాడని మృతురాలి తల్లిదండ్రులు అంటున్నారు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం నరసన్నపేటలో తీవ్ర సంచలనం కలిగించింది. వివరాల్లోకి వెళ్తే.. మధుసూదనరావు, స్వాతి దంపతులు కొన్నాళ్లుగా శ్రీదేవినగర్‌లో నివాముంటున్నారు. వీరికి పదో తరగతి చదువుతున్న కుమార్తె ప్రణవి ఉన్నారు. మధుసూదనరావు నిమ్మాడ స్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన పాఠశాల నుంచి సాయంత్రం ఇంటికి వచ్చే సరికి భార్య ఫ్యాన్‌కు వేలాడుతుండటాన్ని గమనించి పాలకొండలో ఉన్న అత్తామామలు మాణిక్యాలరావు, సుజాతలకు సమాచారం అందించారు. వారు వచ్చాకే మృతి సంగతి వెలుగులోకి వచ్చింది. కొద్దిరోజులుగా భార్యాభర్తలు ఘర్షణ పడుతున్నారని, అందులో భాగంగానే ఆమె ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. మధుసూదన రావు తల్లి ఏడాది కిందట చనిపోయారు. శ్రీకాకుళంలో ఉంటున్న తండ్రిని ఇంటికి తీసుకొచ్చి ఉంచుదామని మధుసూదన రావు అంటుండగా, ఇందుకు భార్య వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. అయితే స్వాతి తల్లిదండ్రులు మాత్రం అల్లుడిపైనే తీవ్రంగా ఆరోపణలు చేస్తూ కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు. ఈ మేరకు నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్వాతి మృతిపై సమాచారం తెలుసుకున్న నరసన్నపేట ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్వయం ప్లస్‌పై సమీక్ష

ఎచ్చెర్ల క్యాంపస్: కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ప్రారంభించిన స్వయం ప్లస్ కార్యక్రమం, కోర్సుల నిర్వహణపై వర్చువల్ సమీక్ష మంగళవారం జరిగింది. కేంద్ర విద్యాశాఖ, మద్రాస్ ఐఐటీ నిర్వహించిన సమీక్షలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ కె.ఆర్.రజిని హాజరయ్యారు. విద్యార్థుల ప్రవేశాలు, ప్రయోజనాలు, విద్యార్థులు నేర్చుకునే అంశాలపై సమీక్షించారు.

జాబ్‌మేళాలో 18 మంది ఎంపిక


అభ్యర్థికి ధ్రువపత్రం అందిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలోని స్కిల్ హబ్‌లో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 44 మంది హాజరు కాగా 18 మందిని ఎంపిక చేసి ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.సుధ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్, ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు, ప్రిన్సిపాల్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

వీఓఏ తొలగింపుపై నిరసన


ఆందోళన చేస్తున్న మహిళలు

పాతపట్నం:మండలంలోని ఆర్.ఎల్.పురంలో 20 సంవత్సరాలుగా వీఓఏ(విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్)గా పనిచేస్తున్న తనను రాజకీయ కక్షతో తప్పించారంటూ డోల భాగ్యవతి మంగళవారం పాతపట్నం వెలుగు కార్యాలయం వద్ద మహిళా సంఘ సభ్యులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా భాగ్యవతి మాట్లాడుతూ ఏపీఎం ఇబ్బందులు పెట్టి తనను అకారణంగా విధుల నుంచి తొలగించారన్నారు. అన్ని సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు నా సేవలను గుర్తించి నాకు మద్దతు ఇవ్వడానికి ధర్నాలో పాల్గొన్నారని పేర్కొన్నారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

28 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సీజ్

కంచిలి: ఒడిశా రాష్ట్రానికి తరలిస్తున్న పి.డి.ఎస్.బియ్యాన్ని జిల్లా విజిలెన్స్ అధికారులు దాడి చేసి మంగళవారం పట్టుకున్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో కొనుగోలు చేసిన ఈ బియ్యాన్ని పికప్ వాహనంలో ఒడిశాకు తరలిస్తుండగా ముందస్తుగా అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు మకరాంపురం జంక్షన్ ఆదివారం సంత వద్ద నిఘా వేశారు. వాహనం రాగానే అడ్డుకుని అందులోని 60 సంచుల్లో ఉన్న 28.10 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని కేసు నమోదు చేశారు. బియ్యం రవాణా చేస్తున్న ఒడిశా వ్యాపారి రంగాల హరిశ్చంద్ర, డ్రైవర్ కొణతల విశ్వనాథంపై 6ఏ కేసు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ బి.రామారావు, సి.ఎస్.డి.టి. పి.కూర్మారావు, ఆర్ఐ. కృష్ణప్రసాద్ రౌతో తదితరులు పాల్గొన్నారు.


మారథాన్ ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ రైతా, సబ్ కలెక్టర్ కల్యాణి, తదితరులు


కబడ్డీ పోటీలను తిలకిస్తున్న తహసీల్దార్ స్వయి, ప్రేక్షకులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- రాయగడలో చైతీ క్రీడా ఉత్సవాలు

రాయగడ: స్థానిక గొవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరగనున్న చైతీ మహోత్సవాల్లో భాగంగా ప్రతి ఏడాదిలా ఈసారి కూడా జిల్లా యంత్రాంగం చైతీ పేరిట క్రీడా ఉత్సవాలను మంగళవారం నుంచి ప్రారంభించింది. స్థానిక రిలయన్స్ బంక్ నుంచి ఉదయం మారథాన్ రేస్‌కు శ్రీకారం చుట్టింది. జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర రైతా ముఖ్యఅతిథిగా హాజరై మారథాన్‌ను ప్రారంభించారు. సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి అక్షయ్ కుమార్ ఖెముండి, జిల్లా పౌరసంబంధాలశాఖ అధికారి బసంత కుమార్ ప్రదాన్, తహసీల్దార్ ప్రియదర్శిని స్వయి తదితరులు పాల్గొన్నారు.

మారథాన్ రేస్ కు అనూహ్య స్పందన

చైతీ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన మారథాన్ రేస్‌కు అనూహ్య స్పందన లభించింది. యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రిలయన్స్ బంక్ నుంచి ప్రారంభమైన రేస్ సుమారు 5 కిలో మీటర్ల దూరంలో గల హలువ తోట వరకు కొనసాగింది. ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్త చర్యలు చేపట్టారు.


మారథాన్‌లో పాల్గొన్న యువతీ, యువకులు

కబడ్డీ పోటీలు..

మహిళా కళాశాల మైదానంలో మహిళల మధ్య కబడ్డీ పోటీలను జిల్లా యంత్రాంగం నిర్వహించింది. తహసీల్దార్ ప్రియదర్శిని స్వయి ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను మంగళవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభించారు. హోరాహోరీగా కొనసాగిన ఈ పోటీలను ప్రేక్షకులు ఆసక్తిగా తిలకించారు. జిల్లా సంసృతి భవన్ జట్టుకు, అంగన్‌వాడీ కార్యకర్తల జట్టుకు మధ్య జరిగిన పోటీలో అంగన్‌వాడీ కార్యకర్తల జట్టు విజేతగా నిలిచింది. ట్రాన్స్‌జెండర్ల మధ్య కూడా కబడ్డీ పోటీలు జరిగాయి. అంబాగుడలో గల ఇండోర్ స్టేడియంలో పవర్ లిఫ్టింగ్, స్థానిక గొవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో వాలీబాల్ పోటీలు జరిగాయి.


కబడ్డీ పోటీలకు టాస్ వేస్తున్న రిఫరీలు


కబడ్డీ ఆడుతున్న మహిళలు


మారథాన్‌లో పాల్గొనేందుకు పేర్లను నమోదు చేసుకుంటున్న యువకులు

ఉల్లాసంగా మినీ మారథాన్


మారథాన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధాన్


పరుగు తీస్తున్న యువకులు


పోటీదారులకు వాటర్ బాటిళ్లను అందజేస్తున్న స్థానికులు


పోటీకు సిద్ధపడుతున్న ఔత్సాహికులు


పేర్లు నమోదు చేసుకుంటున్న విద్యార్థులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు జరగనున్న మల్యావాంత్ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం మినీ మారథాన్‌ను అధికారులు నిర్వహించారు. ఎంవీ 11 గ్రామం నుంచి స్థానిక బుట్టిగూడ యూపీ స్కూల్ వరకు మారథాన్ సాగింది. జిల్లా అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధన్ పచ్చజెండా ఊపి మారథాన్‌ను ప్రారంభించగా.. రెండు వందలకుపైగా పోలీసు, హోంగార్డు, విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు మల్యావాంత్ ఉత్సవాల వేదికపై బహుమతులు ప్రదానం చేస్తామని జిల్లా డీఐపీఆర్‌వో ప్రమిళ మాఝి తెలిపారు.

పత్తి మండీ ప్రారంభం


పత్తి మండీని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి

రాయగడ: స్థానిక బజారు నియంత్రణ కమిటీ ప్రాంగణంలో పత్తి మండీని సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి మంగళవారం ప్రారంభించారు. జిల్లాలో పత్తి రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా సంబంధితశాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా దళారుల బారీ నుంచి రైతులు నష్టాలు పాలవుతున్నారన్నారు. సరైన అవగాహన లేకపోవడంతో తక్కువ ధరకు రైతుల నుంచి వారు పత్తిని ఖరీదు చేసి నష్టాల ఊబిలోకి నెట్టి వేస్తున్నారన్నారు. ఇకపై ఇటువంటి వాటిపై అడ్డుకట్ట వేయాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రతి క్వింటా పత్తికి రూ.7,521 చెల్లించాలన్నారు. రైతులు కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిన మండీల్లో పంటలను విక్రయించాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 3,161 మంది రైతులు పత్తిని విక్రయించేందుకు పేర్లను నమోదు చేసుకున్నారని ఆర్ఎంసీ కార్యదర్శి కె.సత్యరాజు తెలియజేశారు. మూడు నెలలు పత్తి మండీలు తెరిచి ఉంటాయన్నారు.

క్రికెట్ పోటీల్లో గజపతి జట్టు ప్రతిభ


కప్‌తో గజపతి జిల్లా క్రికెట్ క్రీడాకారులు

పర్లాకిమిడి: ఒడిషా రాష్ట్ర సమూహ విద్యాలయాల క్రికెట్ పోటీలు బరిపదలోని శ్రీరామ చంద్రభంజదేవ్ విశ్వవిద్యాలయం స్టేడియంలో ఈ నెల రెండు నుంచి ఏడో తేదీ వరకూ ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలకు గజపతి జిల్లా నుంచి బాలురు, బాలికల అండర్-17 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో గజపతి జిల్లా జట్టు విన్నగా మిగిలి కప్‌ను కైవసం చేసుకున్నట్టు డీఈవో డాక్టర్ మాయాధర్ సాహు తెలిపారు.

పురాతన వృక్షాల నరికివేత


రోడ్డుపై దుంగలు

జయపురం: గుప్తేశ్వర్ శివ పీఠాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు పురాతన వృక్షాలను నరికివేస్తున్నారు. దీనిపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గుప్తేశ్వర్ వాతావరణానికి కూడా ఇది చేటు కలిగిస్తుందని చెబుతున్నారు. జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితిలో దట్టమైన అడవిలో ప్రకృతి అందాల నడుమ పర్వత గుహలో అపూర్వ శివలింగం రూపంలో గుప్తేశ్వరుడు భక్తులకు దర్శనమిస్తాడు. అటు రామగిరి నుంచి గానీ బొయిపరిగుడ నుంచి గానీ గుప్తేశ్వర్ వెళ్లే వారికి ప్రకృతి అందాలు, చిరుగాలులు, పక్షుల కూతలు ఆహ్వానిస్తాయి. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. అందుకు అవసరమైన పనులు చేపట్టింది. ఈ క్రమంలో గుప్తేశ్వర్ ఎగువ ప్రాంతంలో ఒక మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టింది. దీని కోసం దారికి రెండువైపులా చెట్లు కొట్టేస్తున్నారు. దీన్ని భక్తులు ఖండిస్తున్నారు. అభివృద్ధి పేరుతో చెట్లు కొట్టడం ఆపాలని కోరుతున్నారు.

హక్కులపై అవగాహన


టంకువలో నిర్వహించిన మానవ హక్కుల అవగాహన శిబిరంలో సుమన్ జెన, తదితరులు

జయపురం: అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం వారు మంగళవారం అవగాహన శిబిరం నిర్వహించారు. జయపురం సమితి టంకువ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిబిరంలో ముఖ్యఅతిథిగా ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచారపతి సుమన్ జెన పాల్గొని హక్కులపై అవగాహన కల్పించారు.

మత్తుతో జీవితం చిత్తు

ఎచ్చెర్ల క్యాంపస్ : ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో మంగళవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సంకల్పం ర్యాలీ నిర్వహించారు. ముందుగా వీసీ కె.ఆర్.రజిని ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు. వర్సిటీలో యాంటీ డ్రగ్స్ కమిటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు వ్యసనాలకు బానిసై విలువైన జీవితం పాడు చేసుకోవద్దని హితవుపలికారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ నాటకాలుగా దమంజొడి 'ధొరో', కొట్‌పాడ్ 'దాదన'


ధొరో నాటకంలో ఒక సన్నివేశం

జయపురం: కొరాపుట్ పర్వ్ ఆదివాసీ మహోత్సవాల సందర్భంగా.. జయపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి నాటక పోటీల్లో పంచవటి నాట్య మహోత్సవ దమంజొడి వారు ప్రదర్శించిన 'ధొరో', కొట్‌పాడ్ దమయంతీ కళాపరిషత్ వారి 'దాదన' నాటకాలు ఉత్తమ బహుమతులు పొందాయి. ఉత్తమ డైరెక్టర్లుగా ప్రకాశ్ మహంతి, శేశదేవ్ శతపతిలు ఉత్తమ నాటక రచయితలుగా ఆనంద చంద్ర పాఢీ, చంద్రశేఖర దాస్, ఉత్తమ నటులుగా నిర్మల కుమార్ రౌత్, ప్రకాశ్ మహంతి, ఉత్తమ సహాయ నటులుగా దేబబ్రత జెన, దీపక్ కుమార్ దాస్, ఉత్త అభినేత్రిలుగా సస్మిత మిశ్ర, సభిత భట్, ఉత్తమ సహాయ అభినేత్రిగా రీణా జానీ, రశ్మిత స్త్రైప్, ఉత్తమ హాస్యనటులుగా సమీర్ మహాపాత్రో, బస్తురి భంక్, ఉత్తమ శిశు కళాకారులుగా ఎం.ధనశ్రీ, సాత్విక కుమార్ మిశ్ర, ఉత్తమ సంగీత దర్శకునిగా 'ధొరొ' నాటకానికి బంధావణ ఖండవాల్, మహిరావణ వధ నాటక దుర్యోదన మఝి బహుమతులు పొందారు. జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బహిణీపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గౌరవ అతిథిగా జయపురం సబ్ కలెక్టర్ అక్కవరం శొశ్య రెడ్డి విజేతలను బహుమతులతో సత్కరించారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అదానీ అక్రమాలపై దర్యాప్తు చేపట్టాలి

- సీపీఐ ఆందోళన


ఆందోళన నిర్వహిస్తున్న కమ్యూనిస్టు నేతలు

జయపురం: గౌతమ్ అదానీ అక్రమాలు, ఆర్థిక వ్యవహారాలపైన పార్లమెంట్ కమిటీతో దర్యాప్తు జరపాలని భారతీయ కమ్యూనిస్టు పార్టీ కొరాపుట్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. మంగళవారం జయపురం 26వ జాతీయ రహదారి ప్రధాన కూడలి వద్ద కమ్యూనిస్టు శ్రేణులు ఆందోళన చేపట్టాయి. కొరాపుట్ జిల్లాలో ఖనిజ సంపద అదానీకి ధారాదత్తం చేస్తున్నారని కమ్యూనిస్టు పార్టీ ఆరోపించింది. కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి జుధిష్టర రౌళో నేతృత్వంలో నిర్వహించిన ఆందోళనలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రమోద్ కుమార్ మహంతి మాట్లాడారు. దేశ పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతూ సామాన్యుడి వెన్నెముక విరిస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాల వలన పరిశ్రమలు మూతపడుతూ నిరుద్యోగ సమస్య తీవ్ర రూపం దాల్చిందని ఆరోపించారు. కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు ప్రజలపై పెనుభారాన్ని మోపుతున్నాయన్నారు. బంగాళాల దుంపలు, ఉల్లి గడ్డలు, పప్పులు, వంటనూనె, ఉప్పు, మందులు, కాయగూరలు, అత్యవసర, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. దీనికి బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలే కారణమన్నారు. డబుల్ ఇంజిన్ పాలనలో ప్రజావ్యతిరేక విధానాలపై కమ్యూనిస్టు పార్టీ పోరాటం సాగిస్తూనే ఉంటుందన్నారు. ఆందోళనలో కమ్యూనిస్టు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రామకృష్ణ దాస్, నిత్యానంద పండా, బలభద్ర మోడీ, అలఖ పాత్రో, తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో జయపురం అభివృద్ధిపై చర్చ


జయపురం బీజేపీ నాయకుడు గౌతమ సామంతరాయ్ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చంద్ర మఝిని కలిసి జయపురం అభివృద్ధిపై చర్చించారు. నవరంగపూర్‌లో మండయి మహోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన సమయంలో జయపురం విమానాశ్రయంలో సామంతరాయ్ ముఖ్యమంత్రిని కలిసి చర్చించారు. - జయపురం

సన్మార్గంలో పయనించాలి


హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

- జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి


ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: జీవితంలో క్రమశిక్షణ, కార్యదీక్ష ఉన్న వారు ఉన్నత శిఖరాలకు చేరుతారని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. సోమవారం రాత్రి స్థానిక పాత అగ్నిమాపక కేంద్రం మైదానంలో అరవింద శిక్షణ కేంద్ర వార్షికోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ఉత్సవాలను ప్రారంభించారు. పాఠశాల పరిచాలన కమిటీ అధ్యక్షుడు హరిహర కరసుధా పట్నాయక్ అధ్యక్షతన వార్షికోత్సవం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించాలన్నారు. గుణాత్మక విద్యను అందించాలన్నారు. అరవింద శిక్షణ కేంద్రం పట్టణంలోని విశిష్టమైన పాఠశాల అని, ఈ పాఠశాలలో చదివిన ఎంతో మంది నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని వివరించారు. ఈ పాఠశాల ఉన్నతికి ఎమ్మెల్యే నిధి నుంచి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ ఉత్సవంలో మున్సిపాలిటీ మాజీ ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ రథ్ (మున్నా రత్), అరవింద పాఠ్య చక్ర కో ఆర్డినేటర్ ఉమాకాంత ఆచార్య, శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ పంచానన మిశ్ర, కార్యదర్శి నవకృష్ణ రథ్, పరిచాలన కమిటీ సభ్యులు తేజేశ్వర పండా, తదితరులు పాల్గొన్నారు.

చేతబడి నెపంతో వ్యక్తి హత్య


లక్ష్మీపూర్ పోలీస్ స్టేషన్‌లో నిందితులు

కొరాపుట్: చేత బడి చేశాడనే నెపంతో ఓ వ్యక్తిని దారుణంగా హతమార్చారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కొరాపుట్ జిల్లా బందుగాం సమితి జరపా గ్రామంలో శివ మినియకా (30)ని మంత్రగాడు అనే నెపంతో హత్య చేశారు. ఈ గ్రామంలో దాస్ మినికా అనే వ్యక్తి గత మూడు నెలలుగా ఆనారోగ్యం పాలై మృతి చెందాడు. గతంలో మృతుని కుటుంబానికి శివకు విబేధాలు ఉండేవి. దీంతో శివ మృతికి చేతబడి చేయడమే కారణమని భావించి అతడిని దారుణంగా హత్య చేశారు. అనంతరం రెండు మృతదేహాలను ఒకేచోట దహనం చేశారు. ఈ విషయం పోలీసులకు చెబితే కుటుంబాన్నంతా అంతం చేస్తామని బెదిరించడంతో శివ కుటుంబీకులు మిన్నకుండిపోయారు. అయితే పోలీసులకు విషయం తెలియడంతో వారు గ్రామానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీం దహనం చేసిన చోట ఆనవాళ్లు సేకరించింది. ఈ దారుణానికి పాల్పడిన జాగిలి మెనక, రుపా మెనక, డుంబురి మెనక, జగ మినకలను అరెస్ట్ చేశారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు పట్టణ క్రీడాకారుల ఎంపిక



అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు

విజయనగరం అర్బన్: హిమాచల్ ప్రదేశ్‌లో జనవరిలో జరిగే అంతర్‌యూనివర్సిటీ జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు పట్టణానికి చెందిన సత్య డిగ్రీ కళాశాల క్రీడాకారులు పలువురు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన సౌత్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో ఆంధ్రయూనివర్సిటీ తరఫున పోటీ పడిన పల్లవి 71 కేజీల విభాగంలో 90 కేజీల స్నాచ్, 117 కేజీల క్లీన్ అండ్ జెర్క్ మొత్తం 202 కేజీల బరువును ఎత్తి బంగారు పతకాన్ని సాధించింది. పల్లవితోపాటు పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిన ఎ.యశశ్రీ, బి.నీరజ, ఆర్.రాంబాబు జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక య్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.సాయిదేవమణి తెలిపారు. విజేతలకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, కళాశాల యాజమాన్య సభ్యులు ఎం.అనురాధ, ఎం.వివేక్, పీడీ ఎస్‌హెచ్‌ప్రసాద్, కోచ్ చల్లా రాము, కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

పెదకుదమలో ఏనుగులు



పెదకుదమ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని పెదకుదమ పరిసర ప్రాంతాలలో మంగళవారం ఏనుగులు దర్శనమిచ్చాయి. వరిధాన్యం కళ్లాల్లో ఉండడంతో రైతులు లబోదిబోమంటున్నారు.అరటిపంట కోతదశలో ఉందని, చెరకు,పామాయిల్ పంటలు చివరి దశలో ఉండడంతో పంటలను ధ్వంసం చేస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల నుంచి ఏనుగులు ఇక్కడే ఉండడంతో రాత్రిపూట పొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు ఏనుగులను తరలించే ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గుర్తుతెలియని మృతదేహం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. ఈ విషయం గమనించిన వీఆర్వో పువ్వల మహేంద్ర కురుపాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై పి.నారాయణరావు తెలిపారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై పేర్కొన్నారు.

ఆటో నుంచి జారిపడి మహిళ..



ప్రమాదంలో మృతి చెందిన వరలక్ష్మి

పూసపాటిరేగ: మండలంలోని సీహెచ్ అగ్రహారం జంక్షన్ జాతీయరహదారిపై ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ జారిపడి తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ప్రమాదం వివరాల్లోకి వెళ్తే గోవిందపురం గ్రామానికి చెందిన కసిరెడ్డి వరలక్ష్మి(45) గ్రామం నుంచి ఆటోలో ప్రయాణం చేస్తుండగా సీహెచ్ అగ్రహారం సమీపంలో ఆటోలో నుంచి జారిపడడంతో తలకు బలమైన గాయం తగిలి సంఘటనా స్థలంలోనే మృతిచెందింది. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గర్భిణుల పట్ల నిర్లక్ష్యం తగదు



పీహెచ్‌సీలో వైద్యసేవలు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

భామిని: ఆస్పత్రికి వచ్చే గర్భిణుల పట్ల నిర్లక్ష్యం వీడి మంచి ఆరోగ్య సూత్రాలు వివరించాలని సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన భామిని,బాలేరు,బత్తిలి పీహెచ్‌సీలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. బత్తిలి ఎస్ఓ గర్భిణుల వివరాలు చెప్పలేకపోవడంతో పీఓ అసహనం వెలిబుచ్చారు. అలాగే భామిని పీహెచ్‌సీలో బయో కెమికల్స్‌ను శుభ్రం చేయడంలో నిర్లక్ష్యం వహించడాన్ని గుర్తించి సిబ్బందిపై మండిపడ్డారు. ప్రతి ఆస్పత్రిలో అవసరం మేరకు మందులు కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. ఆస్పత్రులకు వస్తున్న రోగులు, గర్భిణుల జాబితాలను పరిశీలించారు. స్వయంగా ఆయన బీపీ, సుగర్ పరీక్షలు చేయించుకుని రికార్డులో నమోదు పద్ధతిని పరిశీలించారు. వైద్యాధికారులు డాక్టర్ దామోదరరావు, డాక్టర్ పసుపులేటి సోయల్, డాక్టర్ ఎస్.శివకుమార్‌లు, వైద్య సిబ్బంది కార్యక్రమంలో ఉన్నారు.

అవస్థల్లో చెరకు రైతు

- ప్రోత్సాహం లేక కుంగుబాటు
- తగ్గిన సాగువిస్తీర్ణం
- 13 కొనుగోలుకేంద్రాలకు 7 మాత్రమే ప్రారంభం

ఈ ఏడాది చెరకు సాగువిస్తీర్ణం (15 మండలాల పరిధి)

లచ్చయ్యపేట:	16,33 హెక్టార్లు,
భీమసింగి:	212.69 హెక్టార్లు,
సంకిలి:	4622.66 హెక్టార్లు
మొత్తం సాగు విస్తీర్ణం:	6468.55 హెక్టార్లు
గత ఏడాది మొత్తం సాగు విస్తీర్ణం:	9,472.03హెక్టార్లలో



చెరకు పంట

బొబ్బిలి: తాము అధికారంలోకి వస్తే చెరకు ఫ్యాక్టరీలను తెరిపించి రైతులకు బతుకులు తీపిమయం చేస్తామని బూటకపు హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం నేడు పత్తాలేకుండా పోయింది. ఇక్కడున్న కంపెనీలు తెరిపించడం మాట దేవుడెరుగు. దూరంగా చెరకు ఫ్యాక్టరీకి తరలించేందుకు అవసరమైన తూనిక కేంద్రాలు, రవాణా చార్జీలు కూడా పూర్తిస్థాయిలో చెల్లించకపోవడంతో చెరకు రైతు పరిస్థితి దయనీయంగా మారింది. గతంలో చెరకు ఫ్యాక్టరీలు రైతులను మోసం చేస్తే వారిఆస్తులను జప్తు చేసి ముక్కుపిండిమరీ రైతులకు నయాపైసాతో సహా చెల్లించారు. ఇలా వైఎస్సార్‌సీపీ హయాంలో దాదాపు రూ.42.80 కోట్లను ఎన్‌సీఎస్ ఫ్యాక్టరీ పరిధిలో భూములను విక్రయించి బకాయిలను చెల్లించారు. రైతులకు సకాలంలో ప్రోత్సాహకాలు వచ్చేలా చేశారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. అయితే చెరకు క్రషర్లకు చెరకు తరలించుకునే సత్తా ఉంటే రైతులు పండిస్తున్నారు. లేని పక్షంలో మానుకుంటున్నారు. గతంలోనూ ఇప్పుడూ చెరకు సాగు గణనీయంగా తగ్గడమే దీనికి కారణమని చెప్పవచ్చు.

కొనుగోలు కేంద్రాలేవీ?

జిల్లాలో 13 కొనుగోలు కేంద్రాలకు ఆమోదముద్ర లభించింది. కానీ అమలులో ఉన్నవి కేవలం ఏడు లోపే. దీని వల్ల రైతులు మద్దతు ధరలేకుండా చెరకును క్రషర్లకు విక్రయించుకునే పరిస్థితులు నెలకొన్నాయి. తూనిక కేంద్రాలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో సుదూరంగా ఉన్న కేంద్రాలకు రైతులు వెళ్లాల్సి వస్తోంది. 15 మండలాల పరిధిలో 13 మాత్రమే తూనిక కేంద్రాలు మంజూరు చేసి అన్ని చోట్లా ఏర్పాటు చేయకపోవడం సరికాదని రైతులు విమర్శిస్తున్నారు.

13 కొనుగోలు కేంద్రాలు మంజూరు

సంకిలి ఫ్యాక్టరీకి చెరకును తరలించేందుకు 13 కొనుగోలు కేంద్రాలు మంజూరయ్యాయి. త్వరలోనే పూర్తి స్థాయిలో తెరిపించేందుకు చర్యలు తీసుకుంటాం.
– సత్యనారాయణ, డిప్యూటీ కేన్ కమిషనర్, బొబ్బిలి

అరకొరగా రవాణా చార్జీలు

తాము చెరకు తరలించే కేంద్రాల వరకూ అయ్యే ఖర్చును ఫ్యాక్టరీ యాజమాన్యమే భరించాల్సి ఉన్నా కేవలం అరకొరగా రవాణా చార్జీలు చెల్లిస్తున్నారని జిల్లాలోని చెరకు రైతులు వాపోతున్నారు. ఇక్కడి నుంచి సంకిలిలో ఉన్న ఈఐడీ ప్యారీ సుగర్స్ కంపెనీకి తరలించాలంటే దాదాపు 75 కిలోమీటర్ల దూరం. కానీ ఫ్యాక్టరీ యాజమాన్యం చెరకు రైతులకు 35 కిలోమీటర్ల రవాణా చార్జీలు మీరే చెల్లించుకోవాలని చెబుతోంది. దీనివల్ల రవాణా చార్జీలు భారమవుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ప్రతి ఒక్కరూ హక్కులను తెలుసుకోవాలి

- జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్.దామోదరరావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్.దామోదరరావు

పార్వతీపురంటౌన్: సమాజంలో ప్రతి ఒక్కరూ తమ హక్కులను తెలుసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా రెండవ అదనపు జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షుడు ఎస్. దామోదరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ కళాశాలలో గల మృత్యుంజయ ఆడిటోరియంలో సెట్విజ్ ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ రాజ్యాంగంలో హక్కులను పొందుపరిచారన్నారు. ప్రజలకు సంక్రమించిన హక్కులను దుర్వినియోగం చేయకుండా కాపాడుకోవాలని హితవు పలికారు. మనిషి స్వతంత్రంగా జీవించి, తన మనుగడ కాపాడుకోవడానికి హక్కులు సహకరిస్తాయన్నారు. ఆర్టికల్ 26 ప్రకారం ఒకరి హక్కులకు మరొకరు భంగం కలిగించకూడదని స్పష్టం చేశారు. ఆర్టికల్ 29 విద్యాహక్కు చట్టం ద్వారా ప్రతి ఒక్కరు ఉచిత విద్యను పొందే హక్కు కలిగి ఉన్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో చదువుకోవాలని పిలుపునిచ్చారు. చదువుకోవడానికి స్థానికత అవసరం లేదని, కుల, మత, ప్రాంత, భాషా భేదంతో ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో చేర్చుకోమంటే చట్ట ప్రకారం శిక్షార్హులని పేర్కొన్నారు. హక్కుల కోసం పోరాడాలని, లేకపోతే బానిసలుగా బతకాల్సి వస్తుందన్నారు. ఆర్టికల్ 39 ఇ ప్రకారం చిన్న పిల్లలను హింసించడం చట్టరీత్యా నేరమని, చట్టం ప్రతి చర్యను గమనిస్తుందని హక్కుల కోసం పోరాడేటప్పుడు బాధ్యతలు మర్చిపోకూడదని వివరించారు. ఐపీసీ సెక్షన్ 323 ప్రకారం చిన్న పిల్లలను కొట్టడం నేరంగా పరిగణించి సంవత్సరం వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ, అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్ మాట్లాడారు. సీనియర్ న్యాయవాది జోగారావు, సెట్విజ్ సీఈఓ, జీఎస్‌డబ్ల్యూ అధికారి బి.రాంగోపాల్ వర్మ, ఏబీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డా.ఎం.ఎస్. స్వరూప్, ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల కమిటీ జనరల్ సెక్రటరీ పి.సంతోష్, కోచ్ అశ్విని, దినేష్, ఎన్టీఆర్ ట్రస్ట్ సభ్యులు ఎం. అప్పారావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా అరికట్టాలి

- ఆర్డీఓ రామమోహన రావు



జంతు సంక్షేమ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామమోహన రావు

బొబ్బిలి: కనీస సౌకర్యాలు లేకుండా పశువులను రవాణా చేయకూడదని, అలా చేస్తే చట్టరీత్యా నేరమని ఆర్డీఓ జేవీవీఎస్ రామమోహన రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో డివిజనల్ జంతు సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జంతు సంక్షేమం కోసం అనేక చట్టాలున్నాయని, వాటి అమలుకు కిందిస్థాయి అధికారులు కూడా కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో కోడి,పొట్టేళ్ల పందాలు జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. దేవాలయాలకు 300 మీటర్ల లోపు ఎటువంటి జంతుబలులు నిర్వహించకూడదని, కుక్కలను చంపకుండా వాటికి సంతాన నియంత్రణ చికిత్సలు నిర్వహించాలన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్‌ల అధ్యక్షతన జంతు సంక్షేమ కమిటీల సమావేశాలను నిర్వహించాలని సూచించారు. పాఠశాలల్లో కైండ్‌నెస్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏపీ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్రఅధ్యక్షుడు లోగిశ రామకృష్ణ మాట్లాడుతూ బొబ్బిలి నుంచి బొండపల్లి వరకూ నిత్యం వేలాది పశువులను హింసాత్మకంగా రవాణా చేస్తున్నారని, రవాణా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు.

గోప్రేమికుల ఆత్మీయ కలయికను జయప్రదం చేయాలి

రాష్ట్రంలోని గోరక్షకులతో ఈనెల 14న నిర్వహించే ఆత్మీయ కలయికను జయప్రదం చేయాలని ఏపీ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీఓ రామమోహన రావు చేతుల మీదుగా దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని అయ్యన్నపేట జంక్షన్ వద్ద గల నలమారమ్మ తల్లి గుడి సమీపంలోని తోటలో నిర్వహించే ఈ సమావేశానికి గోప్రేమికులంతా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా కమిటీ ఎన్నిక, గోసేవకులకు సత్కార కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. పశుసంవర్ధక శాఖ బొబ్బిలి డీడీ రాజగోపాల్, ఏడీ ఎల్ విష్ణు,డివిజనల్ పంచాయతీ అధికారి ఎ.మోహన రావు, కేవీఆర్ సత్యనారాయణ, రాజకుమారి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్‌లో జిల్లా విద్యార్థులకు బహుమతులు



బహుమతులు సాధించిన విద్యార్థులు

నెల్లిమర్ల: విజయనగరంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలలో జిల్లా విద్యార్థులు బహుమతులు సాధించినట్లు ప్రభుత్వ డైట్ ప్రిన్సిపాల్ జి.పగడాలమ్మ చెప్పారు. దృశ్యకళా పోటీలలో నెల్లిమర్ల ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పి సౌజన్య మణి ప్రథమ స్థానం సాధించింది. వాయిద్య సంగీత పోటీల్లో విజయనగరంలోని ప్రభాకర్ ఐఐటీ అకాడమీలో తొమ్మిదో తరగతి విద్యార్థి బీపీ శివాత్మిక ప్రథమం స్థానం కైవసం చేసుకుంది. సంప్రదాయ కథలు చెప్పడం పోటీలలో నెల్లిమర్ల ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల ఇంటర్‌మీడియట్ విద్యార్థిని ఎస్.తేజశ్విని ప్రథమ, తొమ్మిదో తరగతి విద్యార్థిని బి.నవ్య ద్వితీయ స్థానం సాధించారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీలలో గెలుపొంది జాతీయ పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను డైట్ ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, అధ్యాపకులు రవికుమార్, సూర్యారావు, రామకృష్ణ, ఈశ్వరరావులు అభినందించారు.

పెస్టిసైడ్-ఫెర్టిలైజర్ అప్లికేటర్ కోర్సులకు ఆన్‌లైన్ శిక్షణ

పార్వతీపురంటౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అగ్రికల్చర్, అల్‌లెడ్ సెక్టార్‌కు సంబంధించి పెస్టిసైడ్-ఫెర్టిలైజర్ అప్లికేటర్ కోర్సులకు ఆన్‌లైన్ ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 13లోపు హెచ్‌టీటీపీఎస్://సార్టుల్/టీజే3యూ2 లింక్ నందు రిజిస్టర్ కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9988853335, 8712655686నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఘనంగా ఉమ్మడి జిల్లా రజక సంఘం ఆత్మీయ సమావేశం



విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగిని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి దిబ్బేశ్వర స్వామి ఆలయ సమీపంలోని తోటల్లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల రజక సంఘం ఆత్మీయ సమావేశం మంగళవారం ఘనంగా జరిగింది. రజక సామాజిక వర్గంలో విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులను సంఘం సభ్యులు సన్మానించి వారి సేవలను కొనియాడారు. అంతా ఐక్యంగా ఉండి హక్కుల సాధనకు పోరాడదామని వారంతా తీర్మానించారు. అనంతరం అంతా కలిసి సహపంక్తి భోజనాలు చేసి సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తంగేటి భాస్కరరావు, కార్యదర్శి జంపా చిన్న, చైర్మన్ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

గురజాడ గృహాన్ని సందర్శించిన నటి సూర్యకాంతం కుటుంబం



తెలుగింటి అత్తగారు పుస్తకాన్ని గురజాడ దంపతులకు అందజేస్తున్న సూర్యకాంతం కుటుంబసభ్యులు

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ వేంకట అప్పారావు స్వగృహాన్ని అలనాటి సినీనటి సూర్యకాంతం కుమారుడు అనంత పద్మనాభమూర్తి, ఈశ్వరీరాణి, బాలసుబ్రహ్మణ్యం, జయలక్ష్మిలు మంగళవారం చెన్నై నుంచి వచ్చి సందర్శించారు. గురజాడ వాడిన వస్తువులను, ఫొటో ఎగ్జిబిషన్ చూసి ఆశ్చర్య చకితులయ్యారు. విజిటర్స్ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురజాడ మునిమనమడు గురజాడ వెంకటేశ్వరప్రసాద్, ఇందిర దంపతులకు తెలుగింటి అత్తగారు పుస్తకాన్ని వారు అందజేశారు.

జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు మెండుగా ఉండాలి



అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు సౌకర్యాలు మెండుగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సూచించారు. ఈ మేరకు మక్కువ మండలంలోని శంబర గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో జరుగుతున్న రహదారి పనులను వచ్చే ఏడాది జనవరిలో జరుపుకోనున్న అమ్మవారి జాతరలోపు పూర్తిచేయాలని కోరారు. అనంతరం చదురుగుడిలో కొలువైన పోలమాంబ అమ్మవారి ఆలయంలో క్యూలను పరిశీలించారు. అలాగే నడిమివీధి విస్తరణ పనులు ఏ విధంగా చేపడుతున్నారో పరిశీలించి అధికారులను వివరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వనంగుడి రహదారి మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉన్నాయని వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు సబ్ కలెక్టర్‌ను కోరారు. పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటుపై ఏఎస్సై శ్రీనివాసరావుతో ఆయన చర్చించారు. పార్కింగ్‌ల ఏర్పాటు నివేదికను త్వరితగతిన అందజేయాలని సూచించారు. చదురుగుడిలో కొలువైన పోలమాంబ అమ్మవారిని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, ఈవోపీఆర్‌డీ పి.దేవకుమార్, ఎంపీటీసీ తీళ్ల పోలినాయుడు, వైస్ సర్పంచ్ అల్లు వెంకటరమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన పెంచాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ టాయిలెట్ డే ముగింపు కార్యక్రమం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగత మరుగుదొడ్లను ఎంత పరిశుభ్రంగా ఉంచుతామో అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లోని మరుగుదొడ్లను అంతే శుభ్రంగా ఉంచుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజల్లో అవగాహన లోపం కారణంగా గ్రామాల్లో, సంతలు, దేవాలయాల చుట్టుపక్కల బహిరంగ మల విసర్జన జరగడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా తయారు కావడంతోపాటు పర్యావరణానికి విఘాతం కలుగుతోందన్నారు. స్థలాభావం వల్ల కొన్ని ప్రాంతాల్లో నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డిని వినియోగించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ ద్వారా 7,500 వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.15వేలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యం నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు, డీపీఓ టి.కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగిపై టీడీపీ నేతల అక్కసు..!

- అకారణంగా బదిలీ



జోగునాయుడు బదిలీ ఉత్తర్వుల కాపీ

విజయనగరం ఫోర్ట్: విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగిపై టీడీపీ నేతలు అక్కసు వెళ్లగక్కారు. కక్షిగట్టి మరి బదిలీ చేయించారు. ఎటువంటి తప్పు చేయకపోయినా అధికార టీడీపీ నాయకులు చెప్పారని విద్యుత్‌శాఖకు చెందిన ఓ అధికారి ఆయనను బదిలీ చేశారు. గంట్యాడ మండలంలోని నీలావతి సచివాలయంలో జేఎల్‌ఎం-2(జూనియర్ లైన్‌మన్)గా గుల్లిపల్లి జోగునాయుడు పనిచేస్తున్నారు. ఆయనను బదిలీ చేయాలని అధికార పార్టీ నాయకులు విద్యుత్‌శాఖ అధికారిపై ఒత్తిడి తెచ్చారు. దీంతో జోగునాయుడిని విజయనగరం డి-4 సెక్షన్ పరిధిలోని మలిచర్ల సచివాలయానికి గత నెలలో బదిలీ చేశారు. అయినప్పటికీ టీడీపీ నేతలు సంతృప్తి చెందకుండా దూర ప్రాంతానికి బదిలీ చేయాలని విద్యుత్‌శాఖ అధికారిపై మళ్లీ ఒత్తిడి తెచ్చారు. దీంతో నెల్లిమర్ల మండలంలోని బూరాడ పేట సచివాలయానికి బదిలీ చేసినట్లు తెలిసింది.

పాలిటిక్స్‌లో ప్రమేయం ఉంది

జోగునాయుడు లోకల్‌గా పాలిటిక్స్‌లో ఇన్‌వాల్వ్ అవుతున్నాడనే ఫిర్యాదు రావడంతో బదిలీ చేశాం. విద్యుత్ శాఖ ఎ.డి విచారణ కూడా చేపట్టారు.
– పెద్దింటి త్రినాథరావు, ఈఈ, ఏపీఈపీడీసీఎల్

ఉద్యోగులను రాజకీయాలకు బలిచేయవద్దు

ఉద్యోగులను రాజకీయాలకు బలి చేయవద్దు. ఉద్యోగులు కూడా ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనవద్దు. నిబంధనలకు విరుద్ధంగా జోగునాయుడిని ఈఈ త్రినాథరావు బదిలీ చేయడాన్ని ఖండిస్తున్నాం. జోగునాయుడికి వ్యతిరేకంగా ఏ అధారాలు లేకపోయినా బదిలీచేయడం విచారకరం.
– సురగాల లక్ష్మణ్, ఏపీ విద్యుత్ ఉద్యోగుల సంఘం(1104) జిల్లా కార్యదర్శి

రైళ్ల రాకపోకలకు.. వెసులుబాటు

- విజయనగరం-రాయ్‌పూర్ రైల్వేలైన్‌కు మహర్దశ
- సింగపూర్ రోడ్డు వద్ద 5.5 కిలోమీటర్ల పొడవైన ఫ్లైఓవర్
- రూ.240 కోట్లతో నిర్మాణానికి రైల్వే బోర్డు పచ్చజెండా
- ఉమ్మడి విజయనగరం జిల్లాకు మరిన్ని ప్యాసింజర్ రైళ్లు వచ్చే అవకాశం



సింగపూర్ రోడ్డు వద్ద నిర్మించనున్న పొడవైన రైల్వే ఫ్లైఓవర్ ఊహాచిత్రం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: వాల్తేరు డివిజన్‌లో కీలకమైన విజయనగరం-రాయ్‌పూర్ రైల్వే లైన్ మరింత ఆధునికీకరణ దిశగా సాగుతోంది. సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న పొడవైన ఫ్లైఓవర్ నిర్మాణానికి మార్గం సుగమమైంది. రూ.240 కోట్లతో 5.5 కిలోమీటర్ల పొడవున రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణానికి రైల్వే బోర్డు పచ్చజెండా ఊపింది. రాయగడ సమీపంలోని సింగపూర్ రోడ్డు వద్ద అటు కోరాపుట్ లైన్, ఇటు విజయనగరం లైన్‌లో వచ్చే రైళ్ల క్రాసింగ్‌కు ఇన్నాళ్లూ ఉన్న ఇబ్బందులు ఫ్లైఓవర్‌తో తొలగిపోనున్నాయి. కొన్ని గంటల విలువైన సమయం కలిసి వస్తుంది. తద్వారా మరి కొన్ని కొత్త ప్యాసింజరు రైళ్లతో పాటు అదనంగా గూడ్స్ రైళ్లను నడిపే అవకాశం కలుగుతుంది. ఇప్పటికే 'అమృత్ భారత్' పథకంలో పార్వతీపురం, బొబ్బిలి రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇవన్నీ పూర్తయితే విజయనగరం, పార్వతీపురం జిల్లా ప్రజలకు రైల్వే ప్రయాణం మరింత సౌకర్యంగా ఉంటుంది.

అతి పొడవైన ఫ్లైఓవర్

విజయనగరం నుంచి పార్వతీపురం మీదుగా రాయ్‌పూర్ రైల్వే లైన్, రాయగడ-కోరాపుట్ లూప్ లైన్ ఒడిశా రాష్ట్రంలోని రాయగడ సమీపంలోని సింగపూర్ రోడ్డు వద్ద క్రాస్ అవుతాయి. దీంతో విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. రైళ్ల క్రాసింగ్‌కు చాలా సమయం పడుతోంది. దీనికి పరిష్కారంగా రైల్వే ఫ్లైఓవర్ నిర్మించాలనే ప్రతిపాదన దీర్ఘకాలంగా ఉంది. ఎట్టకేలకు దీనికి మోక్షం కలిగింది. సుమారు 5.5 కిలోమీటర్ల పొడవున ఫ్లైఓవర్‌ను రూ.240 కోట్లతో నిర్మించడానికి రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది.

వాల్తేరు డివిజన్ జోరు...

సింగపూర్ రోడ్డు వద్ద 5.5 కిలోమీటర్ల పొడవైన ఫ్లైఓవర్‌ను 2027 నాటికల్లా పూర్తి చేయాలనేది లక్ష్యం. ఇది పూర్తయితే రైళ్ల ట్రాఫిక్ తగ్గుతుంది. ప్యాసింజర్ రైళ్లు మరిన్ని నడపడానికి వీలు అవుతుంది. ఇప్పటికే విజయనగరం-రాయ్‌పూర్ లైన్‌లో 25 నుంచి 35 ప్యాసింజర్ రైళ్లు నడుస్తున్నాయి. మరో ఐదు వరకూ పెంచుకొనే వెసులుబాటు కలుగుతుంది. కోరాపుట్-రాయగడ-సింగపూర్ రోడ్డు జంక్షన్ అనుసంధాన ప్రక్రియను ఈ సుదీర్ఘ ఫ్లైఓవర్ సులభతరం చేస్తుంది. తద్వారా గూడ్స్ రైళ్లతో పలు ఖనిజాలు, సిమెంట్ రవాణా మరింత పెరుగుతుంది.

పొడవైన ఫ్లైఓవర్ గొప్ప ముందడుగు...

వాల్తేరు రైల్వే డివిజన్‌లో ఎనర్జీ, మినరల్స్, సిమెంట్ కారిడార్‌గా పేరొందిన విజయనగరం-రాయ్‌పూర్ రైల్వే లైన్‌లో రూ.240 కోట్లతో 5.5 కిలోమీటర్ల పొడవైన రైల్వే ఫ్లైఓవర్ ప్రాజెక్టు గొప్ప ముందడుగు. ఈ లైన్‌లో మౌలిక వసతుల పరంగా ఎదురవుతున్న సవాళ్లకు ఇదొక పరిష్కారం చూపిస్తుంది. ట్రాఫిక్ రద్దీని తగ్గిస్తుంది. రైళ్ల రాకపోకల్లో ఆలస్యం ఉండదు. మరిన్ని కొత్త రైళ్లను నడిపేందుకు వెసులుబాటు కలుగుతుంది.
– మనోజ్‌కుమార్ సాహూ, డీఆర్‌ఎం, వాల్తేరు డివిజన్

స్టేషన్ల అభివృద్ధి పనులూ షురూ...

'అమృత్ భారత్' పథకం కింద ఉమ్మడి విజయనగరం జిల్లాల్లో పార్వతీపురం, బొబ్బిలి రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ పనులు ఇప్పటికే శరవేగంగా జరుగుతున్నాయి. రెండు వైపులా ఇన్, అవుట్ మార్గాలను, ఫుట్ ఓవ్రబిడ్జిలు, లిఫ్టులను ఏర్పాటు చేస్తున్నారు. మల్టీ లెవల్ పార్కింగ్, మార్కెటింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇవన్నీ మరో రెండేళ్లలో పూర్తికానున్నాయి. మరోవైపు విజయనగరం-రాయ్‌పూర్ మూడో రైల్వే లైన్ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే రాయగడ-పార్వతీపురం మధ్య పూర్తయ్యాయి.